# 'తడి జ్ఞాపకం నించీ'

"అవిసె పువ్వులు రెండు అందకున్నయ్ నాకూ
తుంచి నా సిగలోన తురిమి పోదువుగాని
రావోయి బంగారి మావాఁ"
ఘంటసాల స్వర సురదీర్ఘికా స్నానం చేస్తూన్నా...
'అవిసె పూలు...?' ఒక్కసారి ఆనందం ఆగిపోయింది.

అవునూ, అవిసె పువ్వుల్ని చూసి ఎన్ని రోజులైందీ! అవిసె పువ్వులేనా! మందపు రేకుల సంపెంగలూ?... చాలా... చాలా రోజులైంది. మొగలి పొత్తులింకా కనబడుతూనే వున్నాయి. మొగలి జడలు మాత్రం కనిపించడంలేదు. మరీ పల్లెల కెళ్తే కనబడతాయేమో! ఎందుకిలా? ఒక్కో సంవత్సరంగా జీవితం మననించీ చిన్నచిన్నగా దూరమయిపోడం మన స్పృహ లేకుండానే జరిగిపోతోంటుంది. లేదూ అలా జరగడమే జీవితమా?

ఆ మధ్యన జర్నలిస్టు మిత్రుడు సలీం వేళకాని వేళ వచ్చాడు, అతన్దగ్గర అద్భుతమైన పరిమళం వస్తోంది.

"ఏమిటి భాయీ యీ టైంలో అత్తరూ?" చిలిపిగా అడిగా...

"ఉండండుండండి" అంటూ తెల్లటి లాల్చీ జేబులోంచి రెండు సంపెంగలు తీసిచ్చాడు. "బట్టల బీరువాలో వుంచండి కమ్మటి వాసనేస్తూంటాయి. శ్రీశైలం నించీ ఎవరో తెచ్చిచ్చారు" అంటూ. అతను బట్టల బీరుగా అనంగానే అమ్మ గుర్తొచ్చింది. అమ్మ భౌతికంగా మాకు దూరమై ఇరవై ఏళ్లు అయినా, పాతబట్టల పెట్టె అట్టడుగున అమ్మ జ్ఞాపకార్థం దాచిన పాత పట్టుచీర మెత్తటి మడతల మధ్యన పెట్టుంచిన ఎప్పటివో ఎండిన మొగలిరేకుల పరిమళం అమ్మ జ్ఞాపకమంత మెత్తగా కమ్మగా కమ్మేసింది.

జ్ఞాపకాల పరిమళాల్ని మోసుకొచ్చిన మిత్రుడికి ఎలా కృతజ్ఞతల్చెప్పడం! గతాన్ని ఎంత 'నాస్తి నాస్తి' అనుకున్నా, గతం లేక మనకు భవిషద్వర్తమానాలు లేవుగాక లేవు.

అవిసె పువ్వుల్నించీ కదా ఈ ఆయాసం...

ఎన్ని లిల్లీలూ ఎన్నెన్ని హైబ్రిడ్ రోజాలూ వచ్చినా... ఎండాకాలపు వెచ్చటి సాయంకాలాల్లో. ఎండకాలిన మట్టి తడిసిన వాసనతో కలిసిన జాజుల మల్లెల పరిమళాల ముందు అవి ఏపాటి అనిపిస్తుంది నాకు.

రాత్రంతా వెన్నెల పువ్వుల్ని కురిసి కురిసి అలసిపోయిన పారిజాతం, ఉదయపు

చిరు ఎండలో మెరుస్తూంటే...రాలినపువ్వులు కాలికిందెక్కడ పడుతాయోనని చెట్టు చుట్టూతా ప్రదక్షిణం చేస్తూ ఆ పారిజాతాలనేరడం... ప్రకృతికి దండం పెట్టడం కాదంటారా?

కాంక్రీటు అడవులూ, ఇనుప రక్కసి పొదల మధ్య. యింకా మిగిలింది వీటి స్మరణ మాత్రమే. కుంపట్లలో కడియం వాళ్లమ్మే రంగురంగుల మొక్కలు ఓ నాలుగో అయిదో తెచ్చుకుని, మనకు సరిపోగా యింకా మిగిలితే నాలుగయిదు మగ్గుల నీళ్లు పోసి కాపాడు కోడమే గగనమై పోతోంది.

"ఎన్ని పల్లెల్ని మింగేసినా యీ పాడు పట్టణాలు కాస్తంత పచ్చదనాన్ని మిగుల్చు కోలేకపోయాయి" అన్న మిత్రుడు భాగవతుల చంద్రమౌళి కవితా వాక్యం యిక్కడ స్ఫురణకు రావడం యాదృచ్ఛికం ఎంతమాత్రం కాదు.

ఎండ చంద్ర నిప్పులు చెరగ బోతోంది.

రాష్ట్రం నీటి కరవుతో కటకటలాడుతోంది. జీవనదులెండిపోతున్నాయి. చెరువులు కబ్జాలై పోతున్నాయి.

కనుక మల్లెలూ, సంపెంగలూ, అవిసె పువ్వులూ జ్ఞాపకాల పెట్టెల్లో పెట్టేద్దాం. పచ్చదనం పరారయిపోయిన ఈ గడ్డమీద పాడి పశువులకు పచ్చగడ్డి కూడా ప్రీమియం తిండి అయిపోయింది. డొక్కలెండిన పశువులు జాలిగా మూగగా కబేళాలకు తరలి వెళ్తోంటే పువ్వుల ఊసెత్తడం దుర్మార్గం.

కృత్రిమ వర్షాలూ, నదుల అనుసంధానాలూ రా.నా.లకు ప్రజల్ని పక్కదోవ పట్టించే టాపిక్కులు అంతే. ఖాళీకుండలతో అసెంబ్లీలకెళ్లే నాయకులు, ఏసీ కార్లలో కూచుని ఆయిస్ కోల్డ్ మినరల్ వాటర్ చప్పరిస్తారు. వీధికో కుళాయి రాదుగానీ, ప్రతి వీధికీ రెండో మూడో బ్రాందీ షాపులు తెరుస్తారు. (ప్రభుత్వ ఖజానా ఖాళీగా వుంది కదండీ!)

అయినా ఆశ... కొద్దికాలం కళ్లుమూసుకుంటే... ఆకాశం కరుణించదా, వర్ష హర్షం వెల్లివిరియదా... ఎండిన కొమ్మా రెమ్మా కొత్త చివుళ్లు తొడగవా, నదులు గలగలమనవా... మిగిలిన ఈ కాస్తపాటి జీవితంలో ఎప్పుడో ఎక్కడో

ఓ అవిసె పువ్వో
ఓ మందపు రేకుల సంపెంగనో మళ్లీ చూడనా...
కొత్త గొంతుక విచ్చి ఏ అమ్మాయో తన మనసైనవాణ్ణి పిలుస్తూ
"అవిసె పువ్వులు రెండు అందకున్నయ్ నాకూ" అని కమ్మగా పాడగా వినవా!

* * *

నిజమే ఈ రోజున కనికర రాహిత్యంతో కటిక చీకటి కసిదీరా కమ్ముకున్నా... రేపట్లోకి దారి చూపేది ఒక్కటే.

చిగురంత ఆశ. ●